# ఆకలి

తెల్లారుగట్లో ఎప్పుడో రాత్రి రోడ్డుమీద గోండ్రుగప్ప చచ్చింది. కారో, లారో ఏదో తొక్కిపోయింది. కప్ప నాలుగుకాళ్ళూ నేలకి కరుచుకుపోయాయి. పొట్ట టొమాటో లాగా చిట్లింది. పేగులు రక్తం మాంసం కలగాపులగంగా కలిసిపోయి, చిందిపడ్డాయి. కప్పపొట్ట, వీపు కలిసి నేల కతుక్కుపోయాయి.

ఈ కప్ప ఇక ఎగరదు. ఇక దూకదు. ఇక వానవచ్చినా వరదవచ్చినా బెకిబెకలాడదు ఎండొచ్చినా ఏ మొచ్చినా ఉలకదు పలకదు. చచ్చేముందు చురుగ్గా దూకుతూ, చలాకీగా ఎగురుతూ వచ్చి వుంటుంది. ఏంతిందామని వచ్చిందో! ఏం పొంకుందామని చూచిందో! చచ్చిపోయింది!!

చింతచెట్టు కింద కాళ్ళమధ్య తలపెట్టుకుని వీపు చెట్టుకు మోటించి చేతులు కాళ్ళచుట్టు చుట్టుకొని బితుకుబితుకుమంటూ కూర్చున్న చిన్ని, కప్పను చూచింది. అది చచ్చిపడి వున్నరోడ్డు, రెండు ప్రక్కలా భగవంతుడి అనంతత్వంలాగా వ్యాపించింది. రోడ్డుకవతల గరువునేల కాప్రక్క కొండ మీద కిరీటంలాగా మబ్బుపట్టింది.

పదిరోజులున్నించి ఒకటేవాన! చింతచెట్టు క్రిందరాలిపడిన ఆకులు చిదుగులు, పుల్లలు, చింత బెరళ్ళు వాననీటికి తడిసి రంగుమారి చిత్రంగా వున్నాయి. నేల, రోడ్డుప్రక్క చెమ్మగా, చెట్టుప్రక్క బురదగా వుంది. కాలు మోపితే నరాలు జిల్లుమంటున్నాయి. చిన్నికాళ్ళు పైకి తన్నుకొచ్చిన చింతచెట్టు వేళ్ళమీదపెట్టి కూర్చుంది. తడిసిన చింతచెట్టు మొదలికి వీపు ఆనించిన చిన్నివొంటికి తడితగులుతూ వుంది.

ఈదురుగాలి విదిలించి కొడుతూవుంది. చెట్టుమీద మిగిలిపోయిన మూణ్ణాలుగు నీటిబొట్లు జారిపడ్డాయి. ఉదయం తొమ్మిదయినా పొద్దు పొడ లేదు. వెలుతురులేదు.

రోడ్డుకు రెండుప్రక్కలా ఇళ్ళున్నాయి. కుడిపల్లెలో మేడలున్నాయి. రేడియోలున్నాయి. ఎడంపల్లెలో గుడిసెలున్నాయి. గోడులున్నాయి. కుడి ఎడమను కూలీకి పిలుస్తుంది. బత్తెమిస్తుంది. కుడిపల్లె ఎడమకుగాని, ఎడంపల్లె కుడికిగాని, పెరక్కుండా వేదకాలంనాటి శాశనంలాగా, ఆధునికకాలంలో వంచనలాగా రోడ్డు-ముసిలిదీ ముతకదీకాదు. ఒట్టిదీ మట్టిదీకాదు, తాలుదీ తప్పుటదీకాదు - సిమ్మెంటురోడ్డు, చిద్విలాసంగా చిరంజీవిగా ప్రకాశిస్తూ వుంది. ఈ రోడ్డు కదలదు మారదు ప్రభుత్వ చట్టంలాగా పడినచోటునుంచి లేవదు, ఆ పల్లెకీ ఈ పల్లీ, కనుచూపుమేర! కదలవు, కలిసిపోవు!

చిన్నికేడేళ్ళు! ఎడంపల్లెపిల్ల ఊరికే కూర్చుని ఉత్తినే రోడ్డుమీదికి చూస్తూవుంది. చిన్నిలంగా లంగాకాదు, జాక్కెట్టు జాక్కెట్టుకాదు. మాసిపోయాయి. చిరుగులు కుట్టగాకుట్టగా ఇకకుట్టేచోటులేక చిరిగిపోతున్నాయి

చిన్ని అందమైనదే! ముక్కులోంచి కారే చీమిడిదేముంది, తీస్తేపోతుంది. ఒంటిమురికిదేముంది! నీళ్ళుపోస్తే పోతుంది. తలదేముంది, చిక్కుదీసి నూనెరాస్తే బాగుంటుంది. బట్టలేముంది, కొత్తవి కుట్టించివేస్తే సరిపోతుంది పూలుపెడితే చిన్ని పూవులాగావుంటుంది ఇవేమీలేకపోయినా చిన్ని చూడముచ్చటగావుంది. కనుముక్కు తీరు బాగుంది. కళ్ళలో కళవుంది.

అప్పుడొకటి ఇప్పుడొకటి కారో బస్సో లారో వస్తున్నాయి పోతున్నాయి. ఊళ్ళోంచి పశువుల్ని పొలం తోలుకుపోయే జీతగాళ్ళు గొడ్డుతోలే కర్రలూపుకుంటూ అరచుకుంటూ పోతున్నారు. ఉండివుండి ఈదురుగాలి తోలుతూవుంది.

చిన్నికెదురుగా కుడిపల్లెలోంచి పిల్లవాడు అరటిపండు తింటూ, రోడ్డుమీదికి వచ్చాడు ఎడంచేతిలో ఇంకొకటివుంది. కొంచెం కొంచెం కొరికి కొరికి గిల్లుకు గిల్లుకు నాకి నాకి తింటున్నాడు.

చిన్ని చూచింది నాలుకతడి అయింది. కళ్ళు ఆశతో మిలమిలలాడాయి. రెండుక్షణాలు తదేకదీక్షగా చూచింది పిల్లవాడు ఎదురుగా రోడ్డుకాప్రక్క నిలబడి వున్నాడు. అరటిపండు తింటే అయిపోతుందేమోనన్నట్లు, తినకుండా వుండటానికి వీలులేనట్లు రవ్వంతరవ్వంత కొరుక్కుతింటున్నాడు.

చిన్ని లేచి నిలబడింది. కాళ్ళు ఈడ్చుకొంటూ నెమ్మదిగా రోడ్డుదాటి పిల్లవాడి దగ్గరకు పోయింది. వాడుకదల్లేదు. ఆగలేదు. తింటున్నాడు. తింటున్నాడో, కొరుకుతున్నాడో, నాకుతున్నాడో, నోటికద్ది తీస్తున్నాడో కాని అరటి పండు తరగటంలేదు. నోరాడకుండా ఆగటంలేదు.

చిన్ని పిల్లవాడిముఖంలోకి చూచింది. వాడూ చూశాడు. చిన్ని చూస్తూవుంది. వాడు ముఖం తిప్పుకోలేదు. నోటిపండు, చేతపండు, నోరు, చేయి, మార్చిమార్చి చూచి కళ్ళలోకి చూస్తూ నోరుతెరవకుండా అడుగుతూ వుంది. వాడువినట్లు ముఖం ప్రక్కకు తిప్పుకొన్నాడు.

'నాకు బెట్టవా?'

చిన్ని అడిగింది.

పిల్లవాడువినలేదు.

'నాకు కంచెం బెట్టవా?'

'యేందీ?'

సాగదీశాడు.

'కుంచెం'

బ్రతిమాలింది.

'వుహుూ—నాగ్గావొద్దూ—పెట్ను.'

చెప్పాడు.

'కొంచెం, రొవ్వంత'

'వుహూఁ'

'కుంచెం'

'పెట్నే పెట్ను.'

'సీవఁ తలకాయంత'

'వుఁహుఁ'

చిన్న నోటినిండా నీళ్ళూరాయి. కళ్ళనిండా నీళ్ళూరాయి. గుండెనిండా నీళ్లూరాయి. చిన్ని ఏడుపు ఊటబావిలా అయిపోయింది. ఉత్సాహం పుంజుకొని

చేయి చాపి, గద్ద కోడిపిల్లను తన్నుకుపోయినట్లు, లాక్కోబోయింది. పిల్లల్ని రక్షించుకొనే తల్లికోడిలాగా అరటిపండు రక్షించుకొన్న పిల్లవాడు కుడిపల్లె లోకి పరుగెత్తాడు. వెంటబడబోయి, ముందుకుపడి, మోచేయి సిమెంటురోడ్డు మీద పడిదోక్కుపోతే నుదురుకు బురదయింది. రక్తం గూడుకట్టుకున్న మోచేయి నీళ్ళు కారుతున్న కళ్ళు బురదయి బ్రహ్మరాత కనిపించనినుదురు చిన్నిని అక్కడ నిలబడనీయలేదు. వెనుదిరిగి వస్తూ పిల్లవాడివైపు చూచింది. వాడు పండుచూపి ఇవ్వబోతున్నట్టు చాపి నాలుక బైటపెట్టి వెక్కిరిస్తూ ఎగతాళిచేస్తూ కుడిపల్లెలోకి పోతున్నాడు

చిన్ని ఏడుపు దిగమ్రింగుకొని, కళ్ళనీళ్ళు కళ్ళలో గ్రుక్కుకొని, లంగా చివరతో ముక్కూ కళ్ళు నుదురు మోచేయి తుడుచుకొని, వచ్చి చింతచెట్టు మొదట్లో కూర్చొని వెక్కిళ్ళు అణుచుకుంటూ వుంది

చిన్ని అన్నంతిని మూడురోజులయింది. చిన్నితోపాటు తల్లి, అక్క, తమ్ముడుకూడా తినలేదు బానలో నీళ్ళు చుక్కయినా మిగలకుండా తెల్లవారేసరికి చిన్నితోపాటు అక్కాతమ్ముడు తాగారు.

అమ్మ లేవలేక మంచం మీదేవుంది. నిండునెలలు బలహీనత. తండ్రి కూలీతెస్తే ఇంట్లోకూడు, లేకపోతే నీళ్ళు! తండ్రిఇంటికొస్తే కనీసం నీళ్ళు లేకపోతే కటికి పస్తు! తండ్రి మూడు రోజులున్నుంచి ఇంటికి రాలేదు. రాలేకపోయాడు అక్క వాన్నలాగా కనీసం బావినుంచి నీళ్లయినా తెస్తుంది.

అమ్మ అక్కను ఇరుగింటికి పొరుగింటికీ గిద్దెడు బియ్యమయినా అప్పు అడుక్కురమ్మని పంపింది. ఎడంపల్లెలో ఎవరి బ్రతుకయినా అంతంత మాత్రమే! తమ అదృష్టం లాగా అప్పు దొరకలేదు. ఆ మాటే చెబుతున్న అక్కను చూస్తే చిన్నికి—ఎందుకో తెలియదు-కోపం వచ్చింది.

ఎక్కడ అన్నం వాసనవచ్చినా, ఏక్కడ పొగవచ్చినా, అనుమాన ప్రమాణం తెలియకపోయినా, ఆ యింటికిపోయి, తొంగిచూచి, ఆ యింటి చుట్టూ తిరిగి వాళ్ళు అన్నంతినేశారు. గిన్నెలుకడిగేశారు. అన్నంకుండ బోర్లించారు. అని తెలిసింతర్వాత ఆ యింటినుంచి ఇంకోయింటికి, ఈమూడు రోజులనుంచి ఏడుస్తూ పోయింది చిన్ని.

రాత్రికడుపు నిప్పుపడ్డ వరిగడ్డివామిలాగా కుమిలి కుమిలి కాలింది. నిద్ర పట్టలేదు. వానకాలం ఒట్టి కడుపుతో బ్రతుకుకంటే చావు నయమనిపించింది. చిన్నికి

మునుపు ఎప్పుడైనా రాత్రి ఆకలి అయితే, తెల్లవారితే ఆకలి తీరుతుందన్న ఆశ వుండటంతో, ఎప్పుడు తెల్లవారుతుందాఅని ఎదురు చూడటం చిన్నికి ఆనందమే. మొన్న తెల్లవారింది. ఆకలి తీరలేదు నిన్న తెల్లవారింది. ఆకలి ఆకలిగానేవుంది. ఇవాళ తెల్లవారింది ఆకలి ఎక్కువయింది. ఇంకొక ఉదయం వస్తుందంటే చిన్నికి సంతోషంకంటే దుఃఖమే కలుగుతుంది. ఆకలికి ఎడతెగని విజయం. చిన్ని భరించలేదు.

రాత్రి, ఆకలితో మునగర దీసుకు పడుకొంటే వర్షం-పేదవాడి శాపంలాగా ఇల్లంతా కురిసింది చాపతడిసి కప్పుకొన్న చిరుగులబట్ట తడిసి, ఆకలి మంటతో చలితో తెల్లవారిందాకా నిద్రను భద్రంగా గుప్పిట్లో, పెట్టుకొని ముడుచుకు ముడుచుకు పడుకొన్న చిన్ని తెల్లవారితే బైటికి వచ్చి, ప్రక్కటెముకల నంటుకుపోయిన డొక్క ఊరంతా చూస్తుంటే బాధపడింది.

కాళ్ళూచేతులూ ఖాళీగా ఉన్నకడుపులో పెట్టుకొని చింతచెట్టు కింద చల్లని వొంటితో, చల్లని బట్టలతో దిగులుగా కూర్చుంది చిన్ని. సూర్యుడింకా పుట్టలేదు. పుట్టి ఈ కర్మకాండకు సాక్ష్యం పలకాలని కర్మసాక్షికి భయం. కొండమీది మబ్బు కురిస్తే అరిగిపోతాననో, కరిగిపోతాననో, తరిగిపోతాననో కదలకుండా కన్నెత్తి చూడకుండా, కలవాడి ఆస్తిలాగా కూర్చునింది.

'యావే సిన్నీ?'

గొంతు కఠినంగా వుంది.

చిన్ని తలెత్తి చూచింది ఎదురుగా అరటికాయతినే పిల్లవాడి అన్న..

చిన్ని భయంభయంగా లేచి నిలబడింది.

'యావేఁ మాట్టాడువ్?'

కోపంగా చూశాడు,

'యేంది.'

చిన్ని నంగినంగిగా అడిగింది.

'కాయలాక్కున్నా?'

'వుఁహూ!'

'నిజం జెప్పే?'

'వుఁహూ!'

'అబద్ధఁవాడితే బుగ్గలు బిందుతా?'

'వుఁహూ!'

'చీ' అన్న కసురుకొన్నాడు. 'పిల్లోణ్ణి ఏడిపిత్తావా?' ముఖం తుక తుకలాండింది. 'మొద్దుముఁండ' తిట్టాడు.

చిన్నికి ఏడుపు వచ్చింది.

'నువ్వే!'

'యేందే? యేందినువ్వందే? మళ్ళను సెంపబగలగొడతా'

'నువ్వే!'

చిన్ని అంది అన్న అన్నమాట నిలబెట్టుకోకపోతే సత్యహరిశ్చంద్రుడికి వారసుడు కాకుండా పోడా? ఆడితప్పటమా? ఏం ఏల్లేదు. కొట్టాడు. మాట వరఁకుకాదు, కోపంగానే కొట్టాడు. కొట్టింది చెంపమీద.

చిన్ని చిన్నపిల్ల. ఆకలితో నకనకలాడుతూ చుమ్మలు చుట్టుకుపోతున్న కడుపు. బలహీనపు ఒళ్ళు. చెంపదెబ్బకు నేల మీదపడితే నేల దెబ్బతగిలింది. 'అమ్మ' అని అంటే వినలేదు. విన్నారాదు. రాలేదు. వచ్చినా ఆణ్ణి ఏమీ అనలేదు. అసలు కొట్టనేలేదు. కొడితే ఆమెకే పరాభవం. తండ్రి ఇంటిదగ్గర లేదు కాబట్టి రాడు. అందువల్ల తగాదాలేదు. దాంతో పిల్లవాడి అన్న ప్రమాదం లేకుండా వెళ్ళిపోయాడు

చిన్నికి కడుపులో పేగులు మెలికలు పడిపోయినంత నొప్పిగావుంది. పడినచోటనుంచి లేవాలంటే వోపికలేకపోయింది. మూణ్ణాళ్ళనుంచీ శనిలాగా

పట్టుకొని, దెయ్యంలా వెంటాడుతున్న ఆకలిని మరిపించగలిగినంత దెబ్బ వేసి అన్న పుణ్యం చేసుకొన్నాడు. ఆ దెబ్బతో కడుపునిండిపోయింది. ఆకలి తీరిపోయింది.

చిన్నగా ఈదురుగాలి. సన్నగా జల్లు, తుంపర. కొండమీద మబ్బు గల్లాపెట్టెదగ్గర్నుంచి యజమానిలా కదల్లేదు. చింతచెట్టుకింద జల్లు పడటంలేదు

రాత్రి వాన రోడ్డును కడిగింది. మళ్ళీ రోడ్డు మురికి కాలేదు ఇంతలో మళ్ళీ జల్లు! దీంతో రోడ్డు శుభ్రంగా వుంది. వాననీరు పోయి చాలులో మట్టి కోసుకుపోగా మిగిలిన మట్టిరాళ్ళు భూమి ఇకిలిస్తుంటే కనిపించే పళ్ళు లాగా ఉన్నాయి.

తలస్నానం చేసిన జుత్తులోనుంచి జారిపడే నీటి బొట్లులాగా అప్పుడొకటి ఇప్పుడొకటి బొట్లు జారిపడుతున్నాయి. ఊరి ప్రక్కనున్న హయ్యెరెలిమెంటరీ స్కూలు గంట మ్రోగింది.

నడవటం నేర్చుకొంటున్న కొడుకు చదవటం నేర్చుకోవడంకోసం బడికి పంపాలని వెంటతీసుకుపోతున్న తండ్రిని చలికి ఆకలికి దెబ్బలకు పిచ్చిఎక్కినట్లు అయిపోయిన చిన్ని వెర్రిగా చూచి తలదించుకొంది

నాన ఇంటికాడ లేదు. మొన్నటిదాకా వానకాలంలో కూలీనాలీ లేక ఇంట్లో ఉండీలేక ఎలాగో పూటలు గడుపుతున్నారు. ప్రతిరోజు పొయిలో పిల్లిని తోలాలంటే ఒక మహాయజ్ఞం చేసినంత సంరంభం! నాన్న ఇల్లు వదలి వెళ్లేసరికి పొయ్యి తడిసిపోయింది ఆరిపోయింది. మళ్ళీ వెలగలేదు.

ట్రంకురోడ్డులో పాతికమైళ్ళపైన ఈ గాలివానకు వాగులు వంకలు వరదవచ్చి అయిదారు చోట్ల గండీలు పడ్డాయి. వచ్చేపోయే వాటి రాకపోకలకు ఆటంకం ఏర్పడ్డంతో తక్షణం రోడ్డు బాగుచేయవలసి వచ్చి, కూలీల కోసం మేస్త్రీ వెదుకుతుంటే పనికావలసిన చిన్ని తండ్రి మూడురోజుల్నాడు వెళ్లి ఇంతవరకు ఇంటికి రాలేదు.

రోడ్డు రిపేరు పూర్తి అయిందో, లేదో! నాన ఎప్పుడొస్తాడో ఏమో! ఆకలి ఎప్పుడు తీరుతుందో ఏమో! చిన్ని పిచ్చిమనిషిలా తాగినమనిషిలా పూనకంమనిషిలా తూలిపోతూ వాలిపోతూ సోలిపోతూ వుంది.

ఈదురుగాలి వీపు చీలుస్తూవుంది ఆకలి పేగులు కాలుస్తూ వుంది.

మోచేతిదెబ్బ, చెంపదెబ్బ నుదుటిబురద తలచుకొంటుంటే, తలకాయ పగలకొట్టుకో బుద్ధి పుట్టిస్తున్నాయి దెబ్బలకంటే తగిలిన తీరు ఏడుపు తెప్పిస్తూవుంది.

ఏడ్చి ఏడ్చి కళ్ళుబ్బి, అంతాకారిపోయిన కన్నీరులాగా కురిసే వోపిక లేక వాన సన్నగా జల్లుగా తుంపరగా పడలేక ఆగిపోయింది. అంతకుముందు, ఆ రాత్రి కురిసిన వాన చెట్లకొమ్మల మీదపడి. చరుపులుతిని, ముళ్ళమీద గుండె చీలి, రాళ్ళమీదపడి వీపులు పగిలి, నేలమీదికిపడి మూలుగూతూ పోతూవుంది.

క్వారీరాళ్ళు తోలుకుపోతున్న లారీదూరంనుంచి కిటకిటలాడుతూ వస్తూవుంది. చిన్ని లారీవైపు మొదట అనాసక్తంగా చూచి, అంతలో ఆసక్తితో చూచి, అళగాలేచి నిలబడింది. లారీ కిటకీటలాడుతూ దగ్గరకు వచ్చే సరికి అత్యాశపుట్టింది.

అడుగుముందుకువేసింది. లారీ నిండు బరువుతో నిండునెలల స్త్రీలాగా పూటిగా తూకంగా నెమ్మదిగా వస్తూవుంది. లారీ దగ్గరకు వచ్చేసరికి చిన్ని పూనకం మనిషిలా ముందుకు పరుగెత్తింది.

చిన్నిని డ్రైవరుచూచి 'సేయ్' అని అరిచాడు. వోనరుచూచి 'రేయ్' అని అరిచాడు. లారీకి సడన్ బ్రేక్ వేశాయి అరుపులు. లారీ ఆగింది కిరుకిరు లాడుతూ ఆగింది. లారీవుంది. చిన్నివుంది. లారీముందు చిన్ని. అంగుళపు దూరపు సంబంధం, ఏమీ ఎరగని నంగనాచిలా తలవంచుకొని గోళ్ళుగిల్లు కుంటూ నిలబడింది. లారి కేబిన్‌లోంచి నాలుగుకళ్ళు దిగటం చూసేసరికి చిన్నికి విపరీతంగా ఆకలిఅయి విలవిలలాడిపోయింది. 'ఎవతివే నువ్వు, సద్దా మనుకున్నావా యేంది' డ్రైవరు.

'యాఁవే నువ్ జచ్చేదిగాక మమ్ముల్నిజంపుదాఁవనుకొన్నావా యెట్టా?' వోనరు.

'లేయే లేయే.'

డ్రైవరు నెట్టాడు.

'పోయే పోయే.'

పోసరు తోశాడు.

చిన్ని మళ్లి చింతచెట్టు మొదట్లో పడింది పాత చింతచెట్టు! మునుపటి చెట్టు! శాశ్వతంగా చింతచెట్టు! తల చెట్టుక్కొట్టుకుంది. కష్టంలో ఉన్న కూతుర్ను చూచి తల్లి కన్నీరునించినట్లు చింతచెట్టు నీటిబొట్లు రాల్చింది.

రోడ్డు కడిగి తుడిచినట్లుంది చెమ్మఆరుతూవుంది. రోడ్డు ప్రక్క పిచ్చిచెట్లు మొదుళ్ళకు ఆకులు అలుములు కాగితాలు తగిలి నిలిచి మట్టి పేరుకొని బురద బురదగా వుంది. ఆ ప్రక్క ఇసుకనేలమీద నీటి జాలుసాగిపోగా ఏర్పడ్డ గీతలుబక్కవాడి ప్రక్క ఎముకల ఎత్తుపల్లాల్లాగా కనబడుతున్నాయి.

అక్క తమ్ముడు వచ్చేసరికి చిన్నికళ్ళల్లోనీళ్ళు కనబడటంలేదు. నీళ్ళు ఎండమావులయ్యాయి. ఎండాకాలం గరువుకావుల్లో నీళ్ళులాగా అయిపోయాయి.

'ఏం దిట్టుండా?'

వళ్ళంతా మురికి ఎందుకుంది అన్నట్లుగా చూచింది అక్క.

చిన్ని మాట్లాడలేదు.

'సేయ్! మాట్టాడవేందే? ఇన్నా వాయిన్లేదా?'

చిన్ని బదులుచెప్పలేదు.

అక్క ఎగాదిగా ముఖంలోకి చూచింది. చెల్లి ముఖం మరీవంచుకొంది.

'అప్పా! అప్పోవ్'

చిన్ని భుజం పట్టుకుని కదిపాడు తమ్ముడు, వాడి చేతివేళ్ళు లేతబెండకాయల్లా, నవనవలాడుతున్నాయి.

అక్కాతమ్ముళ్ళ బట్టలు అతుకులుపడ్డాయి. తలలకు నూనెలేదు. తల లోంచి చెంపలలోంచి నీళ్ళుజారుతున్నాయి. తమ్ముడు చలికి వొణుకుతున్నాడు.

'మనమ్మ మూలుగుతావుంది. సిన్నిసిన్నిఅని అడుగతావుంది. ధాయే-దా బోదాం!'

అమ్మ అనేమాట వినేసరికి చిన్నికి వణుకుపుట్టింది. నిండు నెలల్లో మంచంమీంచిలేవలేని అమ్మను తలచుకొంటుంటే ఏడుపువస్తూవుంది. తనకా తిండిలేదు. అమ్మాకూలేదు. తనా తిరగగల్దు అమ్మతిరగలేదు. లేవలేదు. తనే నయం. తనకంటే అమ్మ కనాకష్టం. చిన్ని అమ్మకష్టం చూళ్ళేదు చూచి ఏడుపు భరించలేదు. ఏడిచే వోపికలేదు. గుండెలో తడి అయింది. కళ్ళు ఎండిపోయాయి. తలమీది నీటిబొట్టు చెంపలమీదుగా జారి పెదాల్లోకి పోయి మాయమయింది. రెండు చేతులతో జుత్తు పైకి ఎగదోసుకుని అక్కవైపు, తమ్ముడివైపు మార్చిమార్చి చూచింది చిన్ని.

అక్కకు పదేళ్ళు! అక్క అమ్మకు చేదోడు వాదోడు. అమ్మలేవలేకపోతే అమ్మపనులన్నీ అక్కచేయటం ఈమధ్యే మొదలయింది. చెల్లికి తమ్ముడికి నీళ్ళు పోస్తుంది. ఒళ్ళు తుడుస్తుంది ఉంటే బట్టలేస్తుంది. అక్కకు చిన్నిఅంటే ఎక్కళ్ళేని యిష్టం!

తనకూ తమ్ముడికీ పెట్టకుండా అక్క ఏం కొనుక్కొన్నా తినదు. ఇద్దరికి పెట్టి ఏం లేకపోతే నోరుచప్పరిస్తూ తిరుగుతూ వుంటుంది. కుండలో అన్నం అయిపోవస్తే గుట్టుచప్పుడు కాకుండా తనకూ, తమ్ముడికీ పెట్టేస్తుంటుంది అక్క.

నాన పనికి పోయిన రోజురాత్రి ఉన్నఅన్నం అమ్మతినకుండా అక్కకిచ్చింది. అక్క తినకుండా తనకిచ్చింది. తనకెందుకో తినబుద్ధి పుట్టలేదు. తమ్ముణ్ణి చూస్తుంటే జాలివేసింది. నాలుగు ముద్దలు కలిపి తమ్ముడికి పెడితే వాడు ఆవురావురు మంటూ తిన్నాడు. ఆ కొంచెం అన్నం వాడి కడుపు అయినా నింపకముందే అయిపోయింది.

తమ్ముడు తిని. నీళ్ళుతాగి, అమ్మపక్కలో దూరి వెచ్చగా నిద్రపోయాడు. అక్కా తనూ పడుకొన్నా నానలేక తనకు నిద్రపట్టలేదు. ఆ రాత్రి అమ్మ అక్కతో 'సిన్నదిగూడ నీకు మల్లే పెద్దదైపోయిందే, నూళ్ళా అద్దినకుండా తమ్ముడికి బెట్టింది బువ్వ యేందోలేయే, మనకి తినాగుడవా వుంటేవుంది. లేబోతే లేబోయింది గాని మీకొకళ్ళమీదొకళ్ళకి యిదుంటే సాలే' అంది.

వాళ్ళసంభాషణ వింటూ చిన్ని సంతోషించింది గాని, ఆకలి—అంత

సంతోషంగా లేమ. అమ్మా అక్కా నిద్రపోయినా చిన్నికి నిద్రరాలేదు చీకట్లో పిల్లి కళ్ళుచూచి గట్టిగా కళ్ళుమూసుకొన్న చిన్ని తెల్లవారిందాకా కళ్ళు తెరవలేదు.

తమ్ముడు పిచ్చివాడు. వాడికి ఒక్క ఆటకూడా రాదు. చివరికి కుందాటకూడా సరిగారాదు. మాటలు నోటివెంటసరిగారావు వాడు రోజంతా మాటాడిన మాటలు పాతికవుంటే గగనం. వాడికి మాటకంటే నోట్లోంచి చొంగ వస్తుంది. వాడికి మూడేళ్ళుకూడా లేవు.

అక్కో తనో లేందే వాడు ఇంట్లోంచి బైటికి రాడు. వాడి నడక—పడుతూ లేస్తూ ముద్దుగా ఉంటుంది. వాడి మాటలు నంగినంగిగా నత్తినత్తిగా ముచ్చటగా ఉంటాయి

హోటల్ శంకరయ్యకు తమ్ముడంటే మహాయిష్టం! ఇంట్లో తింటానికి ఏమీలేకపోతే తమ్ముడు చీమపోయినట్లు పోయి, శంకరయ్యా చిటికెన వ్రేలు పట్టుకొంటాడు. శంకరయ్యకి భాష తెలుసు. తమ్ముడికి, అప్పుడు కడుపు నిండుతుంది.

తమ్ముడికీ మూడురోజులనుంచి ఆకలిఅంటే ఏమిటో తెలియదు. అమ్మకి అక్కకీ తింటానికి లేకపోయినా వుంటారు. తమ్ముడికి ఎప్పుడూ తింటానికేదో ఒకటి ఎక్కడో ఒకచోట వుంటుంది. తను ఆకలికి తట్టుకోమూ లేదు. పెట్టేవాళ్ళూ లేరు.

శంకరయ్య హోటల్ తాటాకు పాక! తనకే తిండిలేక నలుగురికింత తినబెడుతున్నాడు, నిన్న తమ్ముడితోపాటు శంకరయ్యా హోటలుకి పోదామని చిన్ని బయలుదేరింది. తనుకూడా వెళితే,—తనకీ తమ్ముడికీ తింటానికేమి పెట్టలేక, తనకులేదని, తమ్ముడికి పెడితే బాగుండదని, తమ్ముడికి కూడా ఏమీ లేదని తరిమేస్తే, తమ్ముడి ఆకలి తీరేదెట్లా వాడేమయిపోతాడు-అని తమ్ముడు వెళుతుంటే చూచి ఊరుకుండిపోయింది చిన్ని.

తమ్ముడు ఏం తిన్నాడో ఏమోబైటికి వచ్చి మూతిముడుచుకొని ఎకాయెకి చిన్నిదగ్గరకు వచ్చి లంగాపట్టుకు లాగుతూ నువ్వేమన్నాతిన్నావా లేదా అని అయినా అడుక్కుండా నోరుతెరచి చొంగకారుస్తూ, కళ్ళు

మూస్తూ తెరుస్తూ 'ఆకుందావాఁ కుందాట' అంటూ అడుగుతుంటే ఏడుపు వచ్చింది. తమ్ముణ్ణెత్తుకుని ఏడ్చింది చిన్ని.

రోడ్డుపైన పల్లాల్లోనిలిచిన బురదనీళ్ళతో ఆడుకుంటూ జీపు ఉరుకులు పరుగులుతో పోయింది. అది చిమ్మిన బురద బట్టలమీద ఒంటిమీద పడింది. అక్క దులుపుకొంది. తమ్ముడికి తుడిచింది. చిన్ని మాత్రం లెక్కలేకుండా తుడుచుకోకుండా కూర్చుంది.

'దాయే యింటికి బోదాం!'

అక్కపిలిచింది.

'దాప్పాదా!'

తమ్ముడు పిలిచాడు.

చిన్ని కదల్లేదు.

'దాయేదా' అక్క బ్రతిమాలుతూ కుడిచేయి పట్టుకొంది. 'దా వా!' తమ్ముడు మూతి మూడువంకరలు తిప్పుతూ ఎడం చేయి పట్టుకొన్నాడు. 'దా, లే' ఇద్దరూ పిలిచారు.

చిన్ని లేవలేదు.

'వుహూఁ.'

అక్క, తమ్ముడు చేతులు వదల్లేదు.

'దా, లే.'

'నేనురాను. ఈడేవుంటా! నువ్ బోయే. నువ్ బోరా.'

చిన్ని కదలకుండా కూర్చుంది.

'అమ్మేడుత్తుంది.'

అక్క చెప్పింది.

'దాప్ప దా బోవాందా,'

'నేనిప్పుడ్రాన్నా- మళ్లొత్తా-నువ్ బో-పోరా.'

అక్క తమ్ముడు చిన్నిచేతులు వదిలిపెట్టారు. చిన్ని అక్కణ్నుంచి లేవలేదు.

అక్కనీ తమ్ముణ్ణి చూస్తుంటే చిన్నికి అమ్మానాన్నా గుర్తుకువచ్చారు. అక్క అచ్చంగా నానలాగా వుంటుంది. నానకి తనంటే ఎంతోఇష్టం! పూలు తెస్తే తనకే ఇస్తాడు. తనని జోకొడుతూ నిద్రపోతాడు. తను లేకుండా—ఇంట్లోవుంటే—అన్నం తినడు.

'నా కూతుర్నా అదురుట్టం' అని పొంగిపోయె తండ్రిగుర్తుకువచ్చి, చిన్ని ఎండిన పెదాలమీద అమృతంలాంటి తడి ప్రాకింది తను తండ్రి భుజాలమీద తప్ప క్రిందదిగి నడవలేదు.

రాత్రివేళ నిద్రపట్టకపోతే, నాన తనని గుండెలమీద వేసుకొని నిద్రపుచ్చేవాడు. తండ్రి గుండె చప్పుడువింటూ గుండెకు దగ్గరగా వుంటూ, ఆ హృదయం—తింటూ తను పెరిగింది

నానవుంటే తిండివుంటుంది. తిండిలేకపోయినా ఇంత అకలికాదు. నానలేక, కూడులేక. వానలో చలిలో బట్టలేక, ఇల్లు సరిగాలేక, లేవలేని అమ్మ కష్టం చూళ్ళేక వున్న చిన్ని కడుపులో, వొంట్లో, కంట్లో, చేతుల్లో కాళ్ళలో ప్రతిరక్తం బొట్టులో ప్రతివెంట్రుకపాదులో ప్రతిసేదరంధ్రంలో ఆకలి వేయినాలుకల నాగులాగా కాటు వేస్తూవుంది

తమ్ముడు పూర్తిగా అమ్మపోలిక. కనుముక్కు తీరులో అచ్చుగుద్దినట్లు అమ్మలాగా వుంటాడు. అమ్మకళ్లలో ప్రేమలాగా తమ్ముడిచేయి చిన్ని భుజంమీద వుంది. చిన్ని ఎందుకయినా ఏడిస్తే తమ్ముడు చూళ్లేడు. చిన్నిచిన్ని చేతులుతో తుడుస్తాడు.

అమ్మ ఎంతగా లేవలేకపోయినా, కదల్లేక పోయినా, మీరాడుకొండేనే జేత్తాలే అని అన్నిపనులు చేసుకొనేది. తనకు ఏంకష్టం కలిగినా అమ్మ సహించదు. చీమకుట్టినా విలవిలలాడిపోతుంది.

అమ్మకు తనంటే ఎంతో గురి! ఎక్కడికయినా పోవాలనుకొంటే 'పోయేదా?' అనిఅడిగి 'పో' అంటే వెళుతుంది. 'ఒద్దు' అంటే మానేస్తుంది.

చిన్నప్పుడు చిన్ని చిన్నదిగా ఉన్నప్పుడు అమ్మ బైటికిపోయి కొంత కుండ బోర్లించి రావాలని పోబోతుంది. కొంపమునిగిపోయినట్లు ఉయ్యేలలో ఉన్న చిన్ని గగ్గోలెత్తిపోయింది బైటికి పోబోతూ ఆగి వెనుదిరిగిపోయి ఏమయిందోనని కిరసనాయిలుబుడ్డి తెచ్చి చూచి ఏమీలేదని, మళ్ళీ బైటికి పోబోయింది. ఈసారి మునుపటికంటే పెద్దగా ప్రాణాంతకంగా ఏడ్చింది చిన్ని. పురుగోపుట్రో అయివుంటుందని ఎంతగా వెతికినా ఏమీ కనబళ్ళేదు.

అమ్మ ఉయ్యేల దగ్గరుంటే ఏడుపుమాని, వెళుతుంటే ఏడుస్తుండటంతో పిల్లభయపడిందని ఆమె అక్కణ్ణుంచి కదల్లేదు. అప్పుడే పొలంనుంచి వచ్చిన నాన్న వాకిట్లో ఉన్నదేమిటో కర్రతో కదిపితేసరి అని చూస్తే, పాము! ఆ రాత్రి నాన్న పామును చంపి ఇంట్లోకి వచ్చాడు.

నాగుబాము చావుచూచి అమ్మ గగ్గోలెత్తిపోయింది. తనబిడ్డ తన ఊపిరిపోసిందని ఏడ్చింది. తనతల్లి, తనను బ్రతికించిందని వలవల విలపించింది ఆ రోజునుండి చిన్ని వద్దన్నపని అమ్మ చేయటం మానుకొంది.

వానపడటంలేదు. ఆకాశం తెరిపివ్వలేదు: రోడ్డు చెమ్మ అక్కడక్కడ ఆరి, నూనెరాసిన తామపాకులాగా ఎత్తుపల్లాలతో తడీపొడిగా మెరుస్తూవుంది. ఈదురుగాలి సన్నగా పక్కసెముకల్లో చొరబడటానికి సిద్ధమవుతూవుంది. కదిలిన చెట్లుమీంచి నీటిబొట్లు కన్నీటిబొట్లులాగా ఉండుండి పడుతున్నాయి.

స్కూలునుంచి పదేళ్ళ అమ్మాయి వస్తూవుంది. తలలో పూలు సిల్కుజాకెట్టు! సిల్కులంగా! అవసరం లేకపోయినా పరికిణీ! రెండు జడలు! జడలు చెర్నాకోల్లల్లాగా ఎగురుతున్నాయి.

జడల్లాగా, చేతులు, చేతుల్లాగా కాళ్ళు, కాళ్ళలాగా నడక ఉత్సాహంగా వుంది. తల ఉత్సాహంగా వుంది. కళ్ళు ఉత్సాహంగా వున్నాయి. ఒళ్ళంతా ఉత్సాహపు వెల్లువలాగా వుంది కడుపులో అన్నకోశం నిండా కూడు ఉత్సాహంతో జీర్ణమవుతూ వుంది

ఆ అమ్మాయికి అక్క వయస్సు. ఆ అమ్మాయినీ అక్కనీ మార్చి మార్చి చూసింది తల, ఒళ్ళు, కాళ్ళు, చేతులు బట్టలు, పూలు పుస్తకాలు—పుస్తకాలు, పుస్తకాలు చూచిచూచిచూచి ఆవురుమని ఏడ్చింది.

'యేందే? యేంది?'

అక్క అడిగింది.

'యేందప్పా యేంది ?'

తమ్ముడడిగాడు.

'యాం లే!'

అక్క తమ్ముడు మళ్ళీ మాట్లాడలేదు. ఒకరిముఖం ఒకరు చూచుకుంటూ నిలబడ్డారు. చిన్ని కళ్ళు తుడుచుకొంది.

బస్తీనుంచి బస్సు వచ్చింది. రంగసామి కూతురు దిగింది. కొడుక్కు జ్వరంవస్తే బస్తీ హాస్పటల్‌కు తీసుకుపోయి వారంరోజులుండి తిరిగివచ్చింది. పిల్లవాణ్ణి తీసుకుపోతున్న బస్సులోనే వాడి జ్వరం పడిపోయి, ఎంతవెతికినా కనబలేదు. ఆ భయం హాస్పటల్‌లో వారంరోజులుండి వారంరోజులు పిల్లవాడు ఉన్నచోట ఉండక హాస్పటల్ అరణ్యం చేస్తుంటే విసిగిపోయి డాక్టర్లు అందరూ చెప్పి చెప్పి, తలబొప్పికట్టి, వెళ్ళకపోతే బయిటికి వెడతారేమో అనిపించినప్పుడు హాస్పటల్ నుంచి బైటపడి ఆరోగ్యంగా ఉన్న కొడుక్కు అనారోగ్యం ఎక్కడుందో వెదుకుతూ దిగింది.

బస్సు దిగిన కూతుర్ని చూచి రంగసామి వచ్చాడు. పడుతూ లేస్తూ వచ్చాడు. కూతురు కొడుక్కు ఒంటిమీద ఈగవాలితే తన ప్రాణం తీసుకునే అల్లుణ్ణి కళ్ళల్లో పెట్టుకుని వచ్చాడు. రంగసామి నడచిరాలేదు. గుండెతో దేకివచ్చాడు. దొర్లి వచ్చాడు.

పైన రోడ్డుమీద పిల్లలు ఆనందంగా వుంటే అక్క తమ్ముణ్ణి నడిపించుకుపోయింది. వాళ్ళు పాముని ఎగరేసి ఎగరేసి చంపుతున్నారు. చిన్ని చూచింది. ఆ పాము వానకు తడిసి ముద్దయి చచ్చిపోయింది, జీతగాళ్ళకి పల్లెపిల్లలకి అది కంటికింపయిన దృశ్యం.

ఆ చచ్చిన పాముని రాళ్ళతో కొట్టి చంపారు. కర్రలతో బాది చంపారు. దగ్గరకు పోకుండా దూరందూరంగా ఉండి చంపారు, చచ్చిందని తెలిసింతర్వాత ఎగరేసి ఎగరేసి చంపారు.

పిల్లలు ఎగిరించే ఎగరటం! ఒకటే గోల! అటునుంచి ఇటునుంచి పిల్లలు వెల్లువలో పరుగెత్తుకుంటూ పోతున్నారు, యేందంటే యేందని ఎగబడెగబడి చూస్తున్నారు

ఎవరు తెచ్చారో ఎండుకట్టెలు తెచ్చారు. ఎవరు తెచ్చారో అగ్గిపెట్టె తెచ్చారు. ఎవరు ముట్టించారో మంటబెట్టారు, చచ్చిన పాముకి శవ సంస్కారం చేస్తున్నారు భావిపౌరులు.

చిన్ని చింతచెట్టు మొదట్లో కూర్చుని చూస్తూ వుంది. అక్కడ కాలి పోతున్న పాము! ఇక్కడ నేలకు కరుచుకుపోయిన కప్ప! కాలుతున్న పాము పొగ మేడలు మిద్దెలు దాటి పైకి పోతూ వుంది కప్ప గుడిసెలు చూస్తూ నేల కిలకరుచుకుపోయింది, కప్ప—పాము 'కరవమంటే కప్పకోపం—విడవమంటే పాముకోపం'—అమ్మ అనే సామెత చిన్నికి గుర్తుకు వచ్చింది.

అక్క తమ్ముడు వెళ్ళి భావిపౌరుల్లో కలిసిపోయారు. ఇక అక్కడ పిల్లలుకాదు అల్లరి వుంది. ఒకటే రద్దీ! ధ్వని!!

చిన్నికి లేవబుద్ది పుట్టలేదు. కదలబుద్ధి కాలేదు. కాళ్ళు అరజాపి చింతచెట్టుకు పూర్తిగా ఆనుకుని చేరగిలబడింది. కళ్ళలో పాముపొగ కావురుగ్రమ్మింది. కప్ప కనిపించటంలేదు. లారీ కనబడుతూ వుంది.

ఏడాదిక్రితం ఇదేరోడ్డుమీద ఇక్కడే ఆ చెట్టుదగ్గర్నుంచి ఈ చెట్టు దగ్గరకు పరుగెత్తుతూ పిల్లలు ఆడుకొంటున్నారు ఎవరో ఏంఆటలని తిట్టారు గాని పిల్లలు ఆట మానలేదు.

దూరం నుంచి వచ్చే లారీ తీరా ఇక్కడికి రాకపోతే ముందే చిన్ని అయితే అటుపోయి, చెట్టుకుముట్టుకుని ఇటుతిరిగిరాగలదని; చిన్ని గుండె కలదని, చిన్ని ధైర్యవంతురాలని ఉత్సాహపరిచారు.

చిన్ని పరుగెత్తుకుంటూ పోయింది. చెట్టును తాకింది. వెనుదిరిగి పరుగెత్తుకుంటూ వస్తూంది. లారీ ఎంతదూరం వచ్చిందో చూసుకోలేదు.

పిల్లలు అరిచి గగ్గోలెత్తి పోతున్నారు. లారీవచ్చేసిందని అరిచారో

చిన్ని లారీకంటే ముందుగా తిరిగి వచ్చిందని అరిచారో, అది భయమో సంతోషమో చిన్నికి తెలియదు. పెద్ద అరపువింది. అంతే! మళ్లీ ఏమీవినలేదు.

చిన్ని కళ్ళువిప్పి చూచేసరికి గొల్లుమంటున్న ఇల్లు నిశ్శబ్దంగా అయింది. అమ్మనీ నాన్ననీ చూచేసరికి చిన్నికి ఏడుపు వచ్చింది. తను చావుదప్పి బ్రతికినట్లు రక్తం బాగా పోయినట్లు విని, చనిపోనందుకు, ఎందుకో, సంతోషించింది చిన్ని.

చిన్నికి మెలకువ వచ్చిందాకా వోనరు అక్కడే వున్నారు. స్పృహ వచ్చింతర్వాత బండెడు బరువు దించినట్లయి, గట్టిగా నిట్టూర్చి, లారీ తోలించుకొని వెళ్ళిపోయాడు.

ఆ రోజు నుంచి నాలుగు నెలలు, నెలకు వందరూపాయిలు ఆరునెలలు చిన్నికి మంచి ఆహారం, నష్టపరిహారంగా వోనరు తనంతటతనే నిర్ణయించుకొని ఇచ్చాడు.

ఆ రోజుల్లో చిన్ని నులకమంచంలో స్వర్గసుఖాలు అనుభవించింది. నిద్రలేస్తే ఎవరోఒకరు పరిచర్య చేశారు. తన మంచిచెడ్డలు చూశారు. తను తిన్నతర్వాత తిన్నారు.

తనవల్ల నెలకు వంద! అమ్మనాన్నలు సంపాదించలేనంత డబ్బు. ఈ డబ్బు చిన్ని ఊపిరి దీపం కొట్టుమిట్టాతుడుంటె కలిగే చీకటి వెలుతురుల కలయికకు ప్రతినిధి! ఈ డబ్బు శవ సమాధిపై పుట్టిన గడ్డిపూవు! ఈ డబ్బు మనిషి రక్తం మట్టిలో కలిస్తే ఆ మట్టికి కట్టిన విలువ! ఈ డబ్బు ఉన్నవాడి ఔన్నత్యాన్ని, లేనివాడి అల్పత్వాన్ని ఎత్తిచూపే జెండా!

ఈ డబ్బు లేకపోయినా బిడ్డను ప్రేమించే తల్లిదండ్రులు, ఈ డబ్బుతో ఇంకా బాగా ప్రేమించారు ఈ డబ్బు ఆనందమే కలిగించింది. ఈ డబ్బు సంపాదించింది తనేనని, దీంతో తల్లిదండ్రులకు తనెంతో ఉపకారం చేసినట్లు ఋణం తీర్చుకొన్నట్లు చిన్ని భావించింది. తృప్తిపొందింది.

బువ్వ తినటమంటె, చిన్ని దృష్టిలో, వరిమెతుకుల్లో పప్పుచారు పోసుకు తాగటం! అది తాము తినేకూడులో అతి వాంఛనీయమైన ఆహారం అంతకుమించి తినటానికి ఏమయినా కూడు వుంటుందని తెలియదు. బ్రెడ్డు

గ్రుడ్డు బువ్వతో సమానమని తెలీయదు. బ్రెడ్డు బట్టరు బ్రెడ్డు జాము నాలుకకు నాజూకుతనం కలిగిస్తాయనీ తెలియదు. లారీ వోనరు బస్తీనుంచి తెచ్చి ఇచ్చే ఆహారం వల్ల తనెంత అమాయకురాలో చిన్ని తెలుసుకొన్నా ననుకొంది.

బ్రెడ్డు గ్రుడ్డు తింటుంటే నాలుకంతా పూసిన ఉద్యానవనంలాగా వింత వింత రుచులు రంగురంగుల పూలై నోరంతా వికసించాయి. బ్రెడ్డు బట్టరు తింటుంటె ఇనుప స్తంభం మీద చేయి రాసినట్లుగా, బురదలో కాలు జారినట్లుగా, అయిస్ ఫ్రూట్ చేతిలోంచి జారిపోయినట్లుగా ఒళ్ళంతా మెత్తగా దూదిలాగా అయిపోయినట్లు అనిపించింది. బ్రెడ్డు జాము తింటుంటె పులపూ, తీపీ, మెత్తగా గట్టిగా తగిలి గొంతు గొంతంతా వయ్యారాలు పోయింది.

ద్రాక్షపళ్ళు తొల్లు తీసుకొని మింగితే, ఎండ పొద్దు బావిలో వేసిన రాయి కనిపిస్తూ పోయినట్లు, గొంతులోంచి పేగుల్లోంచి కడుపు లోలోపలికి దిగిపోయిందాకా చల్లగా జారిపోయింది, బత్తాయో, కమలాపండో, నారింజో తొనతోక్క వలచి, గింజలు తీసి ముత్యాలుమాత్రమే నోట్లో వేసుకొంటె నోరంతా ఊటబావి అయిపోయి, గొంతంతా ఎటుచూచినా కమ్మనిరుచి! ఆపిల్ పండు తొల్లతీసి గింజలుతీసి ముక్కనోట్లో వేసుకుంటె మీగడే నమిలే పనిలేదు. కొరికే పనిలేదు. పంటితో పనిలేదు. నాలుక వేడికి కరిగి గొంతులో దిగిపోవటమే! అరటిపండో, పచ్చరటిపండో, చక్కెరకేళో, రస్తాలోతింటుంటె యుగాల ఆకలి మాయమయి పోతుంది.

జిలేబి నోట్లో వేసుకొంటె నోరంతా నీరు అయిపోయి తీపి! మైసూర్ పాక్ నమిలుతుంటె ప్రతిపన్ను పరమార్థం దర్శించి అవులింత! లడ్డు తింటుంటె స్వర్గం పునాదులు కూలి పడ్డట్లు అమృతం! బూంది నోట్లోవేసుకొంటె నవనాడుల్లోంచి తృప్తి!

మునుపు బిస్కట్లు తినటం పంటికి బలమైన పరిశ్రమ. ఆ మధ్య బిస్కట్లు నోట్లోవేసుకుంటె ఏమయిందో తెలియక దిక్కులు చూచింది చిన్ని. తీపి బిస్కట్లు, ఉప్పుబిస్కట్లు, వగరు బిస్కట్లు, కారం బిస్కట్లు ఒక

శేమిటి, మనిషి దేవుళ్ళా, షడ్రుచులు బిస్కట్లులో ఇమిడ్చినట్లు గుర్తించింది చిన్ని.

తను తినగా మిగిలిన వాటిని ఇంట్లో అందరూ తినేవాళ్ళు నిజానికి చిన్నికుటుంబంలో ఇటువంటి తిండి తినకలగటం. అలా ఆర్నెల్లు తినటం—అదృష్టం!

ఇంకోలా జరిగితే ఏమయ్యేది అన్న ప్రసక్తి అలావుంచి, రోజూ కనీసం కూడయినా ఉండని తనకు, ఇంతమంచి ఆహారం దొరికేలా ఇలా జరగటంవల్ల మేలే కలిగింది

ప్రతిరోజు చిన్ని రోడ్డుమీద లారీకోసం ఎదురు చూస్తూ నిలబడి, లారీ వస్తుంటే ఎగిరి గంతులువేసి. లారీలోంచి ఓనరో, డ్రైవరో ఇచ్చిన ఆహార పదార్థాలు తీసుకొని ఇంటికిపోయె చిన్నికి లారీ అదృష్టంలా, ఓనరు దేవుళ్ళా, లారీ రాక అమ్మనాన్న ఆదరణలా గోచరించి ఆనందం కలుగుతూ వచ్చింది.

ఆర్నెల్లు అయిపోయి, నుదుటిదెబ్బ నయమయి, మాసిపోయిం తర్వాత లారీవచ్చినా పళ్ళు రాలేదు. ఓనరు నవ్వినా మిఠాయిలు ఇవ్వలేదు. లారీ ఆపి 'బాగుండా?' అని వెళ్ళిపోతే దిగులుపుట్టి ప్రతిసారి ఏడ్చింది క్రమక్రమంగా లారీ ఆపటం కూడా మానేశారు.

బ్రెడ్డు తిన్న నోటితో గొడ్డుగారం తినాలన్నా, పళ్ళరసం తాగిన గొంతుతో పచ్చిపులుసుగాని పుల్నీళ్ళుగాని తాగాలన్నా, స్వీట్‌లు తిన్న నాలుకతో పప్పుచారు కూడు తినాలన్నా మొదట్లో వాంతి వచ్చినట్లుంది. ఆకలి దేవుడిచ్చిన వరం. క్రమంగా ఆకలిముందు వాంతి పరారయింది. చిన్ని మళ్లీ మునుపటి తిండికి అలవాటు పడింది. కాని ఎప్పుడయినా, ఈ మధ్య తిన్న తిండి దొరికితే బాగుండునన్న ఆశ పొడసూపుతూ వుంది

లారీ ఆగటంకోసం ఆర్నెల్లు నుంచి. ప్రతిరోజూ నిరీక్షించి, చిన్ని నిరాశ పొందింది. ఆ మధ్య లారీ ఓనరు ఎందుకు అంతగా తినబెట్టాడు? ఈ మధ్య ఎందుకు మానేశాడు? అన్న ప్రశ్నలకు సమాధానం తన సామర్థ్యం కొద్దీ ఆలోచించింది. అంతు దొరకలేదు.

పోనీ, ఏం చేస్తే మళ్లీ అలా తినే అవకాశం వస్తుందా అని ఆలోచించింది. ఆర్నెల్లు ఆ చిన్ని బుర్రలో తిరిగిన ఒకేఒక్క ప్రశ్న! ఏం చేయాలి?

రాత్రి ఆకలికి కడుపు కాలిపోతుంటే, చలికి ఒళ్ళు పగిలిపోతుంటే, వానకి ఇల్లు అదురుతుంటే, అమ్మ మూలుగుతుంటే, నాన్న దగ్గర లేకపోతే, ఉన్నట్లుండి, ఆర్నెల్ల ప్రశ్నకు జవాబు లేతబుర్ర ఆకాశంలో సూర్యుళ్ళా పుట్టింది.

రాత్రంతా చిన్ని నిద్రకు దూరంగా ఉంది. తెల్లవారటంకోసం సూర్యుడికంటే తొందరపడింది. మసకచీకటిలో నిద్ర లేచింది. పదిసార్లు అయినా రోడ్డుమీదికి వచ్చి చూచి యింటికి పోయింది. చివరికి రోడ్డుప్రక్క చింతచెట్టుక్రింద తొమ్మిది గంటల్నుంచి కూర్చుంది.

సూర్యుడింకా ముసుగుతన్ని గుర్రుపెట్టి నిదపోతున్నాడు. చలికి మునగర దీసుకుపోయి, వెలుపలికి రాకుండా ఇంట్లో కొండకొమ్మున తారట్లాడుతున్న మబ్బు రిక్రూటింగ్ ఆఫీసరులాగా మేఘాలను పోగేసుకొని ముందుకు వచ్చింది. గాలికి కాళ్ళొచ్చి, మేఘాల మెడలుబట్టి నెట్టుకువస్తూ వుంది. వున్నట్టుండి వాన మొదలయింది. వాన చినుకులు గురిచూచి వదలిన బుల్లెట్లలాగా పడుతున్నాయి.

చిన్ని కూర్చున్న చోటునుంచి లేవలేదు. ఏటవాలు చినుకులు ఒంట్లోకి చొచ్చుకుపోయెట్టు పడుతున్నా లేవలేదు. రోడ్డుమీద ఆడుకొంటున్న పిల్లలు ఇళ్ళకు పరుగెత్తారు. కుడిపల్లెలో వాన హోరు తప్ప జనం అలికిడి లేదు ఎడంపల్లెలో వానజోరు మరీ ఎక్కువగా వుంది. రోడ్డు కనుచూపు మేరదాకా ఎడారిగా వుంది. ఎక్కడా మనిషి జాడలేదు

ఎక్కడచూచినా వానే! కొండమీద, పొలంమీద, ఇళ్ళమీద, చెట్లమీద, రోడుమీద ఎక్కడచూచినా వానే! వాన విశ్వసత్యమై కురుస్తూవుంది ఆకాశం వానను కంటుంటె నేలచలిని ఈనుతూవుంది. ఈచలి, ఈ వాన చిన్నికితోడు!

నీటి బొట్లుపడి, ఆకులు బరువై, కొమ్మలు బరువై, తలలు వంచుకొన్నచెట్లు బీదవాడి దైన్యంలాగా కనబడుతున్నాయి వానకు తడిసి కుదించుకొని, మునగర దీసుకుపోయిన గడ్డివామి ఆకలయిన కడుపులాగా వుంది.

చిన్ని రొడ్డును తేరిపార జూస్తూ వుంది. తూర్పున ఉదయించిన సూర్యుళ్ళా వస్తున్న లారీని చూచేసరికి చిన్ని ఆనందానికి పట్టపగ్గాలు లేకుండాపొయాయి. అదే లారీ! ఆ లారీ తనకీపడు బాగా పరిచయం అది కనబడుతుంటే ఒంట్లో ప్రతిరక్తం బిందువూ వెలుపలికి ఉరుకుతూ వుంది. ముందుకుదూకుతూ వుంది.

ఆ లారీ,—వోనరు మంచితనంలా సాగిస్తూవుండి అమ్మ ప్రేమలాగా కనబడుతూ వుంది. దేవుడి దయలాగా ఎదుటికివస్తూ వుంది. బ్రెడ్డులా, పండులా, లడ్డులా, బిస్కట్టులా కడుపు నింపేతిండిలా లారీ కదిలివస్తూ వుంది

చిన్ని లేచి నిలబడింది. లారీ క్షణక్షణానికి చేరువవుతూ వుంది. ఘడియ ఘడియకూ ఆశ పెరుగుతూ వుంది. రక్తం ఉబికి పడుతూ వుంది. ఆకలి తీరిపోతున్నట్లుగా వుంది.

లారీ నిండుగా బరువుతో వస్తూవుంది. వాన పటవాలుగా పడుతూ వుంది. ఆకాశం నుంచి భూమి మీదికి మసకపొర జారింది. పల్లె పట్టపగలు నిశ్శబ్దంగా వుంది మనిషి అలికిడి లేదు

లారీ దగ్గరగా వచ్చింది. చిన్ని రోడ్డుమీదికి పరుగెత్తింది అంతదాకా చిన్నిని డ్రైవరు చూడలేదు. అప్పుడే చూశాడు. నవ్వుతున్న చిన్నిని చూశాడు. నవ్వుతున్న చిన్నిని చూచి గుర్తుపట్టి ఏడ్పుముఖం పెట్టాడు డ్రైవరు

వోనరు నోట్లో ఉన్నచుట్ట చిన్నిని, నవ్వుతున్న చిన్నిని. లారీ ముందున్న చిన్నిని, చూచి, జారి కిందపడిపోయింది.

చిన్ని నవ్వుతూ వుంది ఆ నవ్వులో నవ్వులేదు ఏడుపుంది. ఆకలుంది. బాధ వుంది. ఆ నవ్వులో కళలేదు. కాంతిలేదు. ఆ నవ్వు నవ్వుకాదు. ఆ నవ్వులో దిగులుంది. దుఃఖముంది. దైన్యముంది. ప్రార్థనవుంది. బ్రతిమాలటముంది ప్రాధేయపడట ముంది.

రోజూ డ్రైవరు నవ్వటం రివాజు! ఇప్పుడన్నవ్వలేదు. ఎప్పుడూ

నవ్వుకు బదులు నవ్వటం వోనరుకు ఆచారం! ఇప్పుణ్ణవ్వలేదు. చిన్ని ముఖం నవ్వుతూనే వుంది! ఇప్పుణ్ణవ్వలేదు.

డ్రైవరు చేతులు వణికాయి. కాళ్ళు వణికాయి. లారీ నిండుగా కవుకిస్తూ వస్తూవుంది. వాన పడుతూ వుంది. రోడ్డు జారుతూ వుంది. బ్రేక్ వేశాడు డ్రైవరు. లారీ ఆగలేదు. బ్రేక్ పళ్లేదు. లారీ ఆగే సూచనే లేదు. చూస్తున్నారు.

ఎదురుగా దగ్గరగా చిన్ని, అందమైన చిన్ని, తెలివైన చిన్ని' చావుదప్పి బ్రతికిన చిన్ని! తన కిష్టమయిన చిన్ని.

వోనరు గుండెలు విలవిలలాడుతున్నాయి. నరాలు తెగుతున్నాయి. కాళ్ళూ చేతులు స్వాధీనం తప్పుతున్నాయి.

డ్రైవరు కాళ్ళు చేతులు బుద్ధి ఒళ్ళు చురుకుగా పనిచేశాయి. స్టీరింగ్ ఒడుపుగా తిప్పాడు. లారీ ప్రక్కకు తిరిగింది. ఆగలేదు.

చిన్ని చూచింది. అమృతంలాంటి లారీ, అన్నంలాంటి లారీ తప్పించుకుపోతుంటే భరించలేక పోయింది లారీ ఎటుతిరిగిందో చిన్ని అటు తిరిగింది ఎటుపోయిందో అటుపోయింది. ఎదురుగా అడ్డంగా నిలబడింది.

'సిన్నా!'

అరిచాడు డ్రైవరు. లారీ స్టీరింగ్ మళ్లీ తిప్పాడు. లారీ రోడ్డెక్కింది. బలంగా వోపికకొద్దీ బ్రేక్ తొక్కాడు. కర్ కర్ మంటూ ముసలివాడి గొణుగుడులాగా లారీ ఆగుతూ వుంది. చిన్ని కనబడలేదు.

చిన్ని చూస్తూవుంది. ఎదుట లారీ! కర్ కర్ మని ధ్వని. నుదుటికి దెబ్బ! మునుపు తగిలినచోట మళ్ళీ దెబ్బ!

చిన్ని పడుతున్నాను కాబోలు అనుకొంది. రోడ్డుమీద పడింది. మునుపు రోడ్డు ప్రక్కకు పడింది. ఇప్పుడు రోడ్డు మధ్యపడింది. మునుపు లారీకి ప్రక్కగా పడింది. ఇప్పుడు లారీకి ఎదుట పడింది. లారీ ఆగలేదు. స్పృహ తప్పుతుందనుకొంది. తప్పింది.

పొట్టకు ఏమో తగిలింది. అమ్మచేయో, నాన్నచేయో అనుకోవచ్చు

చిన్ని. స్పృహావస్తే ఎదుట అమ్మో, నాన్నో ఉండవచ్చుననుకోవచ్చు చిన్ని. ఆకలయిన కడుపుమీద అమ్మ చేత్తో రాస్తూ వుంది అనుకోవచ్చు.

చిన్నికి ఇక ఇప్పుడేం తెలియదు. లారీ వుంది. రోడ్డు వుంది. దాని మీద చిన్ని వుంది. లారీకి బ్రేక్ పడి ఆగింది. ఆగుతూ సాగింది. సాగి ఆగిపోయింది.

ముందు చక్రం తన క్రింద రాయిపడ్డట్టు అయితే ఎక్కిదిగింది. లారీ ఆగగానే అటు వోనరు, ఇటు డ్రైవరు లారీలోంచి క్రిందికి దూకారు.

ఆ చుట్టు ప్రక్కల చిన్నిలేదు. ఎటుపోయిందో కనబల్లేదు లారీ క్రిందనుంచి రక్తం వర్షంనీటిలో కలిసి ఎర్రగా రోడ్డుప్రక్క నీటి జాలులోకి పోతూ వుంది.

రోడ్డు మధ్య లారీ చక్రంక్రిందపడి, పొట్టపగిలి, రక్తం అన్ని ప్రక్కలకు చిమ్మి, కాళ్ళు చేతులు నేలకు ఇలకరుచుకుపోయి అప్పచ్చిలాగా అతుక్కుపోయివున్న గోంగ్రుగప్ప, పెద్దగోంగ్రుగప్ప, అరిచేది, ఎగిరేది, దూకేది, ఆలోచించేది, ఏడ్చేది, నవ్వేది, కడుపు కాలి అల్లాడేది, ప్రేగులు తునిగి, ఆకలికి దూరంగా పోయింది.

ఆంధ్రపత్రిక పరీధావి సంవత్సరాది సంచిక (1972-73)